ఫ్యాక్షన్ వద్దు.. అభివృద్ధే ముద్దు

- నారాయణరెడ్డి ఆశయాలను బతికిద్దాం
- కార్యకర్తలకు అండగా ఉంటా
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): చెరుకులపాడు నారాయణరెడ్డిని అంతమొందిస్తే తమకు అడ్డు లేదనుకున్న కేఈ కుటుంబానికి 2019 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు.. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదనే ఫ్యాక్షన్ వద్దు.. అభివృద్ధే ముద్దు అనే నినాదంతో పాలన సాగిస్తున్నామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలో ఆదివారం నారాయణరెడ్డి 6వ వర్ధంతిని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ముందుగా నారాయణరెడ్డి సమాధికి, వాల్మీకి సాంబశివుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేపట్టిన మెగా రక్తదాన శిబిరంలో 148 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆమె మాట్లాడుతూ నారాయణరెడ్డి లేని లోటును తాను తీర్చుతానని, కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటానని తెలిపారు. తన భర్త మరణానంతరం జగనన్న ఇచ్చిన ధైర్యం, మీ ఆదరాభిమానాలతో మీకు సేవ చేసుకునే భాగ్యం లభించిందన్నారు. నాలుగేళ్లలో పత్తికొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వెల్దుర్తిలో ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, హంద్రీనీవా కాలువ ద్వారా 68 చెరువులకు నీరు మళ్లించే పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను భయపెట్టి, మభ్యపెట్టి రాజకీయాలు చేయడం కాదని, వారి మనస్సులను గెలుచుకునేలా చేయాలనేది తమ అభిమతమన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరగకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ చైర్మన్ శ్రీరాములు, పార్టీ జిల్లా నాయకుడు మురళీధర్‌రెడ్డి, కంగాటి వెంకటరామిరెడ్డి, నారాయణదాస్, వెల్దుర్తి, మద్దికెర, తుగ్గలి జెడ్పీటీసీ సభ్యులు సుంకన్న, మురళీధర్‌రెడ్డి, పులికొండనాయక్, ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, ఆర్‌బీ వెంకటరాముడు, జిట్టా నాగేష్, కారం నాగరాజు, కర్నూలు కార్పొరేషన్ కార్పొరేటర్ స్వప్న, పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు, పక్కీరప్ప, మాధవరావు, సహకార సొసైటీ చైర్మన్లు వంశీధర్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, శాంతన్న, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ టీఎండీ హుసేన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్‌కుమార్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు వెంకట నాయుడు, నాయకులు బలరాముడు, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి,హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- **పత్తికొండటౌన్:** పత్తికొండలో ఎంపీపీ నారాయణదాసు ఆధ్వర్యంలో నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **తుగ్గలి :** బొందిమడుగులలో పార్టీ నాయకులు మునిరెడ్డి, ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న, జొన్నగిరిలో పీఏసీ చైర్మన్ రఘు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖరరెడ్డి, తేరప్ప ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.
- **కృష్ణగిరి:** తాపలకొత్తూరు, పులిచెర్లకు చెందిన నాయకులు వెంకటేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌గౌడ్ స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రజలకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

భానుడి భగ భగ

- మండుతున్న ఎండలు
- ఉదయం 9 గంటల నుంచే సెగలు కక్కుతున్న సూరీడు
- బయటకు రావడానికి జంకుతున్న జనం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
16	38	19	42
17	39	20	43
18	41	21	42

గోనెగండ్ల: భానుడి సెగలకు జనం విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడిమి మొదలవుతుండటంతో బయటకు రావడానికి జంకుతున్నారు. 11 గంటల తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తప్పనిసరి పరిస్థితిలో ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తువాలు లేదా గొడుగు లేదా టోపీ ధరించాలని, నీళ్ల బాటిల్ వెంట ఉంచుకోవాలని, వీలైనంత వరకు ఎండలో తిరగకుండా పని పూర్తి చేసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఇక వేడి గాలులకు వడదెబ్బ బారిన పడకుండా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీటిని ఎక్కువగా తీసుకోవాలి
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తినాలి
- పండ్ల రసాల కన్నా, పండ్లను తింటే ఎక్కువ లాభం ఉంటుంది
- తేలిక పాటి, నూలు, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి
- సాధ్యమైనంత వరకు ప్రయాణాలు మానుకోవడం ఉత్తమం
- అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి


నిర్మానుష్యంగా ఎమ్మిగనూరు-కర్నూలు రోడ్డు

- ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు/ టోపీ ధరించాలి.

మధ్యాహ్నం ప్రయాణాలు తగ్గించుకోవాలి..

వేసవిలో వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవడం మేలు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. తప్పనిసరైతేనే ప్రయాణాలు చేయాలి.

అప్పుడు కూడా హెల్మెట్‌గాని, క్యాప్‌గానీ ధరించాలి. వీలైనంత వరకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తరువాత ప్రయాణం చేస్తే మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రయాణాలకు దూరంగా ఉండాలి. చల్లని పానీయాలు తరచూ తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. వడదెబ్బ తగిలిన వెంటనే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తీసుకోవచ్చు. ఫ్రిడ్జ్ నీటి కంటే కుండలోని నీరు శ్రేష్ఠమైనవి.

– డాక్టర్. రజిని, గోనెగండ్ల, పీహెచ్‌సీ

విద్యుత్ సమస్య పరిష్కరించండి సారూ..

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో వెయ్యి మంది నివసిస్తున్నారు. లో ఓల్టేజ్ కారణంగా ఫ్యాన్, బల్బులు వెలగడం లేదని వాపోతున్నారు. సమస్య కారణంగా నీటి బోర్లు వేస్తే కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో నీటి మోటార్లు తరచూ కాలిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. విద్యుత్ అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కాగా.. సమస్యపై విద్యుత్ ఏఈ ఉలిగన్న మాట్లాడుతూ గ్రామం మొత్తానికి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, రెండు మోటార్లు ఒకేసారి ఆన్ చేస్తుండటంతో సమస్య తలెత్తుతోందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.


ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

అ'పూర్వ'సమ్మేళనం


నాటి ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997–98లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 25 ఏళ్ల తరువాత వారంతా నాటి ఉపాధ్యాయులతో ఒకే వేదికపై కలిశారు. దీంతో నాడు తాము చేసిన చిలిపి పనులు, తీపి గుర్తులను నెమరవేసుకొని సంతోషంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు వెంకటరమణ, జానకిరామ్, మాధవస్వామి, రాజేశ్వరిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అలాగే ట్యూటర్లు సుబ్రహ్మణ్యం, ఉస్మాన్, వలి, గిప్సన్, ఈరన్నను కూడా సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలు చెప్పిన ఉపాధ్యాయులను గుర్తుంచుకొని ఈ వేడుకకు పిలిచి గౌరవించడం ఆనందంగా ఉందన్నారు.


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(కృష్ణగిరి): 24ఏళ్ల తరువాత వారంతా ఒకే వేదికపై కలిశారు. నాటి మధుర స్మృతులు, చిలిపి తగాదాలను గుర్తు చేసుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని సంతోషంగా గడిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. తమ బ్యాచ్‌లోని నాగరాజు అనే పూర్వ విద్యార్థి మృతి చెందడంతో అతని కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న, శరత్ బాబు, రాముడు, శ్రీను, కిషోర్‌బాబు, శ్రీనివాసులు, మధునాయుడు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాజాకిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండలానికి 220 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారని, క్వింటా ధర రూ.9,300 కాగా 40 శాతం రాయితీ రూ.3,720 పోను రూ.5,580 రైతులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు.

గుర్తింపు లేని కళాశాలలో చేరొద్దు

గోనెగండ్ల: ప్రభుత్వ గుర్తింపు లేని జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలలో చేరి జీవితాలని నాశనం చేసుకోవద్దని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర, తాలూకా అధ్యక్షుడు మునిస్వామి విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేకపోయినా తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను అందులో చేర్పించరాదని కోరారు. నాయకులు ఖలీల్, ప్రవీణ్, సురేష్, రవి పాల్గొన్నారు.

మద్దికెరలో వడగళ్ల వాన

మద్దికెర: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. పెద్ద పెద్ద శబ్దాలతో వడగళ్లు పడడంతో ప్రజలు తలదాచుకునేందుకు పరుగులు పెట్టారు. అలాగే రెండు రోజులుగా వడగాల్పులు, ఎండలతో అల్లాడుతున్న జనాలకు కురిసిన జల్లులతో వాతావరణం చల్లబడటంతో కాస్త ఉపశమనం పొందారు.


కురిసిన వడగళ్లు

స్వధర్మం కన్నతల్లి వంటిది

వెల్దుర్తి(కృష్ణగిరి): భగవద్గీత ప్రకారం మన ధర్మం కన్న తల్లి వంటిదని, దానిని పాటించడమే శ్రేయస్కరమని విశ్వ హిందూ పరిషత్ కేంద్ర సంయుక్త కార్యదర్శి గుమ్మర్స సత్యం తెలిపారు. వెల్దుర్తిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో కర్నూలు జిల్లా ధర్మప్రసార్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రాష్ట్ర కన్వీనర్ అంకాలయ్య, విభాగ్ కన్వీనర్ కాళంగి విజయుడు, వీరశేఖర ఆచారి, వెంకటరమణ ఆచారి, ఆరు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు పురస్కారం

చిప్పగిరి: అర్హులకు పథకాలు అందాలని, వారికి పాలన మరింత చేరువ కావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను అమలు చేస్తున్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే కేవలం నాయకులకు అనుకూలమైన వారికి, ఆయా పార్టీలకు చెందిన వారికే అందేవి. అదికూడా చెప్పులరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉండేది. సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు తప్పనిసరిగా ఉండేది.సంక్షేమ పథకాలను బట్టి ముడుపులు సైతం ముట్ట జెబితే తప్ప ఏ ఒక్క పథకము పేదల దరి చేరేది కాదు. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం పురస్కారాలతో సన్మానిస్తోంది. వారు అందిస్తున్న సేవలకు ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. .వలంటీర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సేవ వజ్ర,సేవా రత్న,సేవా మిత్ర పురస్కారాలతో గౌరవిస్తూ వారికి రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేస్తుంది.

ఆనందంగా ఉంది



మా సేవలు గుర్తించి పురస్కారాలు అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది. గౌరవ వేతనంతో ప్రజలు సేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. తమకు సముచిత స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. – తాయమ్మ, నంచర్ల, సేవా మిత్ర పురస్కార గ్రహీత

ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాలు

ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలు దక్కాయి. మండలంలో మొత్తం 149 వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 110 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవ రత్న పురస్కారలు దక్కాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పురస్కారాలు అందజేస్తాం. – సుధాకర్ రాజు, ఎంపీడీఓ

రైతుకు భరోసా

- నియోజకవర్గంలో 56,447 మంది లబ్ధిదారులు
- ఆర్బీకేల్లో అర్హుల జాబితా ప్రదర్శన

మండలాల వారీగా రైతు భరోసా అర్హులు

మండలం	అర్హులైన రైతులు
1. పత్తికొండ	10,280
2. తుగ్గలి	13,900
3. మద్దికెర	7,340
4. కృష్ణగిరి	14,051
5. వెల్దుర్తి	10,876
మొత్తం	56,447

మద్దికెర : గతంలో ఖరీఫ్, రబీ సీజన్లు ప్రారంభమయ్యాయంటే చాలు అన్నదాత గుండెల్లో గుబులు పెట్టుబడుల కోసం పెత్తందార్ల వద్దకు పరుగులు పెట్టి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతన్నకు పెట్టుబడి సాయం అందజేసి ఆదుకుంటున్నారు. అందులో భాగంగానే నాలుగో విడత సొమ్ము త్వరలోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానుంది. ఈ మేరకు అధికారులు నియోజకవర్గంలో 56,447మంది రైతులను అర్హులుగా గుర్తించి జాబితాలను అయా గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శనకు ఉంచారు.


అర్హత జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఆలూరు రూరల్: చిన్న,సన్నకారు రైతులు వ్యవసాయ సీజన్ ఆరంభంలో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి బయటపడేసేందుకు ఏటా మూడు విడతల్లో రూ.13,500 రైతు భరోసా నగదు అందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ ఏడాది కొత్తగా దరఖాస్తు చేసుకొని అర్హత పొందిన 1,246 మందితో కలిపి ఆలూరు నియోజకర్గంలో 62,636 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా ఎంపిక చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

అర్హులు ఎవరంటే..

- 10 సెంట్ల భూమి సాగు చేసే వారి నుంచి 5 ఎకరాలలోపు సాగు చేస్తున్న రైతులు అర్హులు.
- కుటుంబంలో ఒకరికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుంది.
- పట్టాదారు పాసుపుస్తకం ఖచ్చితంగా ఉండాలి. గత నెల మొదటి వారం నుంచి కొత్తగా రైతు భరోసాకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.
- చనిపోయిన రైతుల స్థానంలో వారి నామిని, కొత్తగా తమ పొలాలు కొనుక్కొని ఇప్పటి వరకు రైతు భరోసా అందని వారు దరఖాస్తు చేసుకున్నారు.
- అన్ని వ్యవసాయ,పండ్ల తోటలు సాగు చేసే కౌలు రైతులు, ఎకరం పొలం సాగు చేసే కౌలు రైతులు అర్హులే.
- దేవదాయ, ఇనాం భూములు సాగు చేసే రైతులు కౌలు సాయం పొందవచ్చు
- డీ పట్టా సాగుచేసుకుంటున్న రైతులు కూడా అర్హులే.
- యజమానికి ఎక్కువ మంది కౌలు రైతులు ఉంటే ఎస్టీ వారికి ప్రాధాన్యం కల్పిస్తారు. తర్వాత ఎస్సీ, మైనారిటీలకు ప్రాధాన్యత ఉంటుంది.

ఏటా రైతు భరోసా అందుతోంది

2019 నుంచి ఏటా నాకు రైతు భరోసా అందుతోంది. సంవత్సరానికి రూ.13,500 వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులకు ఈ మొత్తం చాలా ఉపయోగం. ఈ ఏడాది కూడా జాబితాలో నా పేరు ఉంది. రైతు భరోసా వల్ల అప్పులు చేసే అవసరం తప్పింది. నాకున్న 2 ఎకరాల్లో పంట సాగుకు కొంతమేర అవసరాలు తీరుస్తుంది.

– మారెప్ప, రైతు,ఆలూరు గ్రామం

ముందస్తు పెట్టుబడికి ఉపయోగపడుతుంది

రైతుభరోసా ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ముందస్తు సాయం ఎంతో ఉపయోగ పడుతుంది. గతంలో సాగు ఖర్చులకు ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు కొంతమేర అవస్థలు తప్పాయి. పెట్టుబడి సాయంగా అందజేసే రూ.7,500 సాగు ఖర్చులకు అండగా ఉంటోంది. – హనుమంతు, మద్దికెర

అర్హులందరికీ వర్తింపజేస్తాం

అర్హత కలిగిన ప్రతిరైతుకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తిస్తుంది. ఇప్పటికే ఆర్బీకేల్లో రైతుల జాబితా ప్రదర్శనకు ఉంచాం. గతంలో అర్హత ఉన్నా అందుకోలేని వారికి ఈఏడాది వర్తించేలా చర్యలు చేపట్టాం. – హేమలత, ఏఓ

క్లుప్తంగా

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసుకునే రైతులు ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే విత్తనాల కోసం నేటి నుంచి నమోదు చేసుకోవచ్చని ఏఓ హేమలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో స్థానిక ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. మండలానికి 1050 క్వింటాళ్లు మంజూరయ్యాయని వేరుశనగ కే6 రకం క్వింటా ధర రూ.5,580గా నిర్ణయించారని, ఈనెల 25వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

పిడుగు శబ్దానికి ఎద్దులు మృతి


మృతి చెందిన ఎద్దు

మద్దికెర : మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుము, మెరుపులతో కూడిన వాన కురిసింది. పెద్ద పెద్ద శబ్దాలతో ఉరమడంతో ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బండారు లక్ష్మన్న, కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతులకు చెందిన ఎద్దులు మృతి చెందాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని పొలాల్లో పనులు చేసుకునేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో ఇలా జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆస్పరి: స్థానిక సోమేశ్వర స్వామి ఆలయంలో నాగదేవత, వినాయకుడు, పార్వతి విగ్రహాలతో పాటు కలశం ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు మారుతి స్వామి ఆధ్వర్యంలో గంగ పూజ, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం


మారెళ్లలో సీసీరోడ్డు వేస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని మారెళ్లలో సీసీ రోడ్ల పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ ఎర్రం సుగుణమ్మ, సుధాకర్ రెడ్డితో కలిసి పనులను ప్రారంభించారు. ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గ్రామంలో పూర్తి కావడంతో సచివాలయ నిధులు రూ.20లక్షలు మంజూరయ్యాయి. వాటితో గ్రామంలో సీసీరోడ్లు వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పనులను పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అలాగే రాతన కొత్తూరులో ఎంపీ సంజీవకుమార్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక సంఘం కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అన్నారు. నాయకులు అనంతకుమార్, జగదీష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి


హొళగుంద బస్టాండులో వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపిన దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో బస్టాండ్‌తో పాటు సులువాయి రోడ్డులో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలు పెరగడం, బస్టాండ్ స్థలంలో మోటార్ సైకిళ్లు, తోపుడుబండ్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తుండటం, వాహన చోదకులు నిబంధనలు పాటించక పోవడం తదితర కారణాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఇక రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనల రాకపోకలతో ప్రజలు తిరిగేందుకు అగచాట్లకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రాజగోపురానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం ఓ భక్తుడు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. గుంతకల్‌కు చెందిన కడియాల రంగస్వామి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీలు రూ.200, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

రైతు భరోసా జాబితా ప్రదర్శన

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సాయంగా అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించినట్లు ఏఓ మునెమ్మ ఆదివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు చెప్పారు. రైతులు తమ పేర్లను చూసుకోవచ్చన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

తుగ్గలి : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన మదిర ఈరమ్మ (60) ఆత్మహత్య చేసుకుంది. జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు..ఈరమ్మకు అనారోగ్యంతో పాటు మతిస్థిమితం సరిగా లేదు. శనివారం ఇంట్లో ఉన్న ధైమెట్ గుళికలు మింగి అపస్మారకస్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త గులెప్ప, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

ఆలూరు: పట్టణ సమీపంలోనున్న శ్రీ బెళ్లగుండ ఆంజనేయస్వామి ఆలయంలో ముందు 52 అడుగుల ఎత్తుతో నూతన ఏర్పాటు చేస్తున్న ఆంజనేయ స్వామి విగ్రహానికి రిటైర్డు ఉపాధ్యాయుడు వీరస్వామి రూ. 50 వేలు విరాళంగా నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. కమిటీ సభ్యులు బి.రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రయ్య తదితరులు దాత కుటుంబ సభ్యులను పూలమాలలతో సన్మానించారు.

నాగేశ్వరరావుకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన యోధుడు కొల్లినాగేశ్వర రావు అని సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, రంగన్న, భాస్కర్ యాదవ్ పేర్కొన్నారు. కొల్లినాగేశ్వర రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతుల పక్షాన ఆయన చేసిన పోరాటాలు,సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఆలూరు: ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా వివిధ గ్రామాల ప్రజలకు సరఫరా చేస్తున్న మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న ప్రజలకు సూచించారు. హాలహర్వి, హొళగుంద గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులను ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11 ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ట్యాంకుల వద్ద పనిచేస్తున్న కార్మికులు చెత్త, చెదారం, ముళ్ల కంచెలను తొలగించాలని, ఫిల్టర్ బెడ్లలో పాచీ పేరుకపోకుండా చూడాలని సూచించారు.